సూర్య
17వ వసంతంలోకి...
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 5 డిసెంబర్ 2023
పేజీలు 8

## ప్రజా సంక్షేమమే ధ్యేయం

వివరాలు 2లో



# పన్ను చెల్లింపులో అక్రమాలకు అడ్డుకట్ట






- జీఎస్టీ సేవా కేంద్రాలతో పారదర్శకమైన, సరళీకృత రిజిస్ట్రేషన్
- సామాన్య వ్యాపారులకు సైతం ఈ కేంద్రాలతో ఎంతో మేలు
- రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 4, మేజర్ న్యూస్ :** వ్యాపార వర్గాలకు అత్యంత పారదర్శకమైన, సరళీకృతమైన రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు విధానాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) చెల్లింపులో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో జీఎస్‌టీ సేవా కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ, శాసన వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. విజయవాడ యనమలకుదురు రోడ్డు, కృష్ణానగర్‌లోని రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జీఎస్‌టీ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. వ్యాపార నిర్వహణలో పన్ను చెల్లింపు అనేది భాగమని.. అయితే కొందరు నకిలీ ఆధార్ కార్డు, గుర్తింపు పత్రాల సహాయంతో జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ చేయించుకొని రెండు మూడేళ్లు పన్ను చెల్లించి ఆ తర్వాత మిగతా 2లో



తుఫాను తీవ్రత దృష్ట్యా

## అప్రమత్తంగా ఉండండి

వివరాలు 7లో

ఎలాంటి పరిస్థితినైనా

## ఎదుర్కునేందుకు సంసిద్ధం




- లోతట్టు ప్రాంతాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం
- 64 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాం
- క్యాంపులలో ఆహారం, తాగునీరు, సౌకర్యాలు కల్పిస్తున్నాం
- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

వివరాలు 2లో



# అన్నదాతల ఆవేదన

- కురుస్తున్న వర్షాలకు పడిపోయిన పంట పొలాలు
- ప్రతి సంవత్సరం రైతాంగానికి ఏదో విధంగా నష్టం
- ఆసరా మాత్రం కల్పించలేకపోతున్న ప్రభుత్వం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా దివిసీమ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు చేతికి అందివచ్చిన బంగారు పంట నేలపాలౌతుంటే అన్నదాతల ఆక్రందనలు వెల్లువెత్తుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి అదికాస్త వాయుగుండంగా మారి, గత రెండు రోజులుగా మచిలీపట్నం - చెన్నైల మధ్యలో కేంద్రీకృతమై ఆదివారం సాయంత్రం నుండి మిగతా 2లో...

# పన్ను చెల్లింపులో అక్రమాలకు అడ్డుకట్ట





(మొదటిపేజీ తరువాయి)

ఎగవేతకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) ఎగవేతకూ పాల్పడుతున్నారని వీటికి అడ్డుకట్ట వేయడంతో పాటు వ్యాపారులు, వినియోగదారులకు మేలు చేకూరేలా అత్యంత సరళమైన, పకడ్బందీ విధానాన్ని అమలుచేసేందుకు జీఎస్టీ కౌన్సిల్ జీఎస్టీ సేవా కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఆధార్, బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా చాలా సులభంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఈ కేంద్రాలు వీలుకల్పిస్తాయన్నారు. పన్ను చెల్లింపునకు సంబంధించిన ప్రక్రియలో ఉన్న క్లిష్టతలు తొలగిపోనున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల సమయం కూడా ఆదా అవుతుందని.. డాక్యుమెంటేషన్ తనిఖీ ప్రక్రియ కూడా సులభతరమవుతుందన్నారు. దేశంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్, పుదుచ్చేరిలో ఈ కేంద్రాలు ఉన్నాయని.. ఇప్పుడు మన రాష్ట్రంలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 12 జీఎస్టీ సేవా కేంద్రాలు ప్రారంభమైనట్లు తెలిపారు. సామాన్య వ్యాపారులకు కూడా అనుకూలంగా ఉండేలా ఏదైనా విధానం ఉంటే దాన్ని రాష్ట్రంలో అమలుచేయాలన్న ఉద్దేశంతో కేంద్రాన్ని కోరడం జరిగిందని.. ఆ మేరకు ఇక్కడ కూడా జీఎస్టీ సేవా కేంద్రాలు ఏర్పాటైనట్లు వివరించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా విజయవాడ, కృష్ణానగర్ జీఎస్టీ సేవా కేంద్రం సేవలను చాక్లెట్లు, బిస్కట్లు తయారు చేసి అమ్మే భాస్కర్ అనే వ్యాపారి ఉపయోగించుకున్నట్లు వెల్లడించారు. ఏడాదిన్నరగా రాష్ట్రంలోని పన్నుల విభాగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చినట్లు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, చీఫ్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ అండ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ (విశాఖపట్నం) సంజయ్ పంత్, జీఎస్టీఎన్ సీఈవో (న్యూఢిల్లీ) మనీష్ కుమార్ సిన్హా, జీఎస్టీఎన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (న్యూఢిల్లీ) ధీరజ్ రస్తోగి, రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ ఎం.గిరాజా శంకర్, జాయింట్ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ తదితరులు హాజరయ్యారు.

# ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కునేందుకు సంసిద్ధం







**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** మిచౌంగ్ తుఫాను పరిస్థితిని ఎదుర్కొనేందుకు కృష్ణాజిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయా జిల్లాల్లో తుఫాన్ పరిస్థితులు ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పి జాషువా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని కృష్ణాజిల్లాలో తుఫాన్ పరిస్థితులు తీసుకున్న చర్యలు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురయ్యే 7 మండలాల్లో లోతట్టు ప్రాంతాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. 64 సహాయ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 2 వేల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించినట్లు, ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని, సోమవారం సాయంత్రానికి మొత్తం 8 వేల మందిని రిలీఫ్ క్యాంపులకు తరలించుటకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రిలీఫ్ క్యాంపులలో ఆహారం, తాగునీరు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చలి తీవ్రత దృష్ట్యా బాధితులకు దుప్పట్లు అందజేస్తున్నట్లు దోమతెరలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పిల్లలు గర్భవతులు బాలింతలకు పాలు అందిస్తున్నట్లు తెలిపారు. డెలివరీ సమయం దగ్గర పడిన గర్భవతులను ప్రభుత్వ ఆసుపత్రులకు పంపినట్లు తెలిపారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులను ఒప్పించి రిలీఫ్ క్యాంపులకు తరలిస్తున్నట్లు తెలిపారు. నాగాయలంక మండలంలో ఏడు దీవులలో 4500 మంది జనాభా ఉన్నారని, వీరిని మెయిన్ ల్యాండ్ కు షిఫ్ట్ చేయుటకు మోటార్ బోట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది మినిట్ టూ మినిట్ సమాచారం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రాణ, పశు, పంట నష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ మీడియా ప్రతినిధులతో తో మాట్లాడుతూ రిలీఫ్ క్యాంపుల్లో బాధితులకు మంచి ఆహారం, తాగునీరు, పిల్లలకు బాలింతలకు, గర్భవతులకు పాలు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్ వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు రిలీఫ్ క్యాంపులను ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. రిలీఫ్ క్యాంపులకు వచ్చిన వారు ఇళ్లకు వెళ్లేటప్పుడు కుటుంబంలో ఒక వ్యక్తి ఉంటే రూ.1000లు, ఒక్కో కుటుంబానికి రూ.2000లు చొప్పున, తుఫాన్ కు దెబ్బతిన్న పూరి గుడిసెకు రూ.10 వేలు చొప్పున ఇచ్చి, వారు గుడిసెలు పునర్నిర్మించుకొనుటకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఎలాంటి ప్రాణ నష్టం గానీ, పశువుల నష్టం గానీ, పంట నష్టం గానీ జరక్కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతూ అధైర్య పడవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మచిలీపట్నం, అవనిగడ్డలలో రెండు రాష్ట్ర విపత్తు నివారణ సహాయక దళం(ఎస్డిఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పి జాషువా మాట్లాడుతూ జిల్లా పోలీస్ యంత్రాంగం తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ 86 పునరావాస సహాయ కేంద్రాలకు ప్రజలను తరలించుటకు పోలీస్ బృందాలు సహకరిస్తాయని తెలిపారు. విద్యుత్, మొబైల్ సిగ్నల్స్ అంతరాయం కలిగినప్పుడు వైర్లెస్ సెట్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, తుఫాను అనంతరం వారిని ఇంటికి క్షేమంగా పంపే వరకు పోలీస్ సిబ్బంది సహాయంగా ఉంటుందన్నారు. ముంపు ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులలో ప్రజలను సంరక్షించేందుకు ఈత వచ్చిన పోలీస్ సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ పెద్ది రోజా, జడ్పీ సీఈవో జ్యోతి బసు, బందరు ఆర్డిఓ ఎం వాణి దీనివల్ల సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డు గోదాంలలో ధాన్యం నిల్వ చేసుకోండి

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** మిచౌంగ్ తుఫాను ప్రభావంతో సంభవించే భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని రైతులు కోత కోసిన ధాన్యమును నిల్వ చేసుకునే సౌకర్యము లేని వారు తమ ప్రాంత పరిధిలో గల మార్కెట్ యార్డు గోదాములలో భద్రపరచుకొనవచ్చునని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కే శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఆయా ప్రాంత పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులు, నిబ్బందిని సంప్రదించి ధాన్యాన్ని భద్రపరచుకోవచ్చునని తెలిపారు.

ఇతర వివరాలకు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, విజయవాడ వారి కార్యాలయములో ఏర్పాటు చేసిన 73311 54812 (ఎ.సుకుమార్ ) టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించ వచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



**కృత్తివెన్ను డిసెంబర్ 4 మేజర్ న్యూస్ :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సోమవారం కొమ్మల్లపూడి పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ లబ్ధి పొందారని వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ ఫలాలు అందకపోతే వారికి కూడా వెంటనే అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. కొమల్లపూడి కోఆపరేటివ్ బ్యాంక్ నూతనంగా నిర్మించిన గోడౌన్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం మించౌగ్ తుఫాను ప్రభావం వల్ల తీరా ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిడమర్రు పంచాయతీ పెద్ద గొల్లపాలెం బీచ్ లో సముద్ర ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లరాదని వర్ష ప్రభావం ఎక్కువగా ఉండి ఎవరికైనా ఇబ్బంది ఉంటే అధికార దృష్టికి తీసుకువచ్చి వెంటనే సహాయ సహకారాలు అందించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్, జడ్పిటిసి మైల రత్నకుమారి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి గంగాధర్, తహసిల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీవో పిచ్చిబాబు, వైసీపీ పార్టీ మండల కన్వీనర్ వైధాని వెంకటరాజు, మండల సచివాలయాల కన్వీనర్ కొక్కిలిగడ్డ బాబూజీ, గ్రామ కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆవేదన



13 కిలో మీటర్ల వేగంతో వాయుగుండం ప్రయాణిస్తుండగా దివిసీమ వ్యాప్తంగా ఎడతెడపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలన్నీ నేలబారుగా వాలిపోవడంతో పంటను కోసే పరిస్థితి కూడా దరిదాపులలో కనిపించడం లేదు. రైతులు, కౌలు రైతులు ఎకరానికి 35 నుండి 40 వేల రూపాయల వరకు వెచ్చించి, రాత్రి పగలనకా, ఎండ వాననకా పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతాంగానికి పంట చేతికి వచ్చే తరుణంలో వాయుగుండం రూపంలో రైతుల పంటను నట్టేట ముంచింది. ప్రతి సంవత్సరం రైతాంగానికి ఏదో విధంగా నష్టాన్ని మాత్రం చవి చూస్తుంది. ప్రకృతి వైపరిత్యాల కారణమో, అతివృష్టి, అనావృష్టి ఏదో ఒక కారణంతో దివిసీమ రైతాంగం మాత్రం నష్ట పోవాల్సిన పరిస్థితులే ఏర్పడుతున్నాయి. పట్టెడు అన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకునేందుకు మాత్రం ప్రభుత్వాలు ఎన్ని మారిన రైతులకు మాత్రం మేము ఉన్నాం అనే ఆసరా మాత్రం కల్పించలేకపోతున్నారు. తుఫానులో బాధితులకు సహాయ సహకారాలు అందించేందుకు, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ ఆధ్వర్యంలో ఎస్‌డిఆర్ఎఫ్ బృందం రెవెన్యూ కార్యాలయం వద్ద సిద్దంగా ఉన్నారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కోనేందుకు అధికారులు అన్నీ విధాలుగా ఏర్పాటు చేస్తున్నారు.

# మహిళలను మనుషులుగా గుర్తించిన రోజు డిసెంబర్ 4



**గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజా బెత్ రాణి**

గన్నవరం, డిసెంబర్ 4, మేజర్ న్యూస్ : భర్త చనిపోతే భార్యని కూడా భర్త శవంతోపాటు చితిలో వేసి హత్య చేసే సంప్రదాయం 1889 డిసెంబర్ 4వ తేదీన దీనిని రద్దు చేశారు. ఆ నాడు మను ధర్మ శాస్త్రం అమలులో ఉండేది మను ధర్మ శాస్త్రంలో మహిళలను మనుషులుగా కూడా చూడ లేదు. ఇంటికి పరిమితం చేశారు. ఒకరకంగా చెప్పాలంటే భానిస కన్నా హీనంగా చుచేవారు. భర్త చనిపోతే భార్యని భర్త తో పాటు ఒక మహోజాతరలా జరిగేది. మేళతాలాలతో ఊరేగింపుగా ఊరు ఊరంతా తరలి పోయేవారు. చనిపోయిన భర్తకు చితి పేర్చి చితిపైన పెద్ద మంచె వేసి దానిపై స్త్రీని కూర్చోబెట్టి, చితిపై తన భర్త శవానికి నిప్పు అంటించగానే మంచె యొక్క నాలుగు కర్రలను నలుగురు తొలిగించేవారు. అలా మంచెపైన కూర్చున్న స్త్రీ, కాలుతున్న భర్త చితిపై పడిపోయేది. తను బయటకు రాకుండా పెద్ద కర్రలతో గట్టిగా అదిమి పట్టేవారు. ఆమె అరుపులు వినకుండా పెద్ద శబ్దాలతో మేళతాలాలు వాయించేవారు. అలా ఒక్క బెంగాల్ లోనే లక్షానలభై వేలమంది స్త్రీలను సతీసహగమనం చేశారు. దేశం మొత్తం లక్షల మంది స్త్రీలు అగ్నికి ఆహుతి అయ్యారు. ఇది స్త్రీల జీవితాలను ధ్వంసం చేసిన ఘోరకలి. చరిత్ర తెలుసుకుంటే ప్రతి మహిళ వళ్ళు గగ్గురపడతాయి అటువంటి పరిస్థితులనుండి అనేక మంది నాయకులు రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వర్ చాంద్ విద్య సాగర్, జ్యోతిరావు పూలే కందుకూరి వీరేశలింగం భండారు అచ్చమాంబ రాజ్యలక్ష్మి మోతురు ఉదయం, మల్లు స్వరాజ్యం లాంటి వారు ఆందోళన చేసిన ఫలితంగా నేడు మనం అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా ఎదుగుతున్నాం అని అన్నారు.

# ఘనంగా దివంగత రోశయ్య వర్ధంతి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం రోశయ్య మూడవ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య జిల్లా నాయకులు అవనిగడ్డ మాజీ ఉపసర్పంచ్ ఘంటశాల రాజామోహన్‌రావు (కన్నయ్య) ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడారు. రోశయ్య ఆచార్య ఎన్.జి రంగా శిష్యుడిగా రాజకీయ ప్రస్థానం చేసి, అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్‌కు అనుభవం ఉన్న రోశయ్యను కాంగ్రెస్ పార్టీ ఆదేశాలతో ముఖ్యమంత్రిగా శిరస్సా వహిస్తూ ఆర్థిక చాణిక్యుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 15 వ ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. ఆంధ్ర రాజకీయాల్లో కాంగ్రెస్ నేత రోశయ్య చెరగని ముద్ర వేశారని, ఆంధ్ర రాజకీయ ప్రస్తావన వస్తే ఆయన గురించి తప్పనిసరిగా చర్చించాల్సిందేనని, ఆంధ్ర రాజకీయాల్లో బహుముఖ ప్రజ్ఞ శాలిగా 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు రోశయ్యది అన్నారు. రోశయ్య అనారోగ్యంతో 04.12.2021 న తుది శ్వాస విడిచారని, 1968 నుండి 85 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా కొనసాగారని, ఆ తరువాత 1979-83 కాలంలో రాష్ట్ర మంత్రి వర్గంలో ఆయనకు చోటు దక్కిందని 1985 లో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా ఎన్నికై కొనసాగారని, 1989-94 కాలంలో మరో సారి మంత్రి పదవిలో ఉండి 2004 లో చీరాల ఎం.ఎల్.ఏ గా గెలుపొంది 1998-99 కాలంలో నరసరావు పేట నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్ సభకు ప్రాతినిధ్యం వహించారన్నారు. 2004 లో వైయస్‌రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వంలో రోశయ్య కీలకంగా వ్యవహరించారని 2009 రాజశేఖర్‌రెడ్డి మరణం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా రోశయ్య భాధ్యతలు స్వీకరించి ఏడాది పాటు పదవిలో కొనసాగి ఆయన చేపట్టిన చివరి పదవి ఇదే కావడం గమనార్హం. 2011లో తమిళనాడులో గవర్నర్‌గా నియమితులైన రోశయ్య 2016 వరకు పదవిలోనే కొనసాగారు. రాజకీయాల్లో రోశయ్య 60 ఏళ్ళ పాటు సుదీర్ఘంగా కొనసాగిన నాయకుల్లో ఒకరని అన్నారు. అటువంటి మహా వ్యక్తిని స్మరించుకోవడం రాష్ట్ర ప్రజల భాధ్యత అని రాజామోహన్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకుడు తదితరులు పాల్గొన్నారు.



## దివంగత మహానేతకు ఘన నివాళులు

**పెదన, మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్యవైశ్య పెద్దలు దివంగత నేత కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరము నందు ఘన నివాళులు అర్పించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లూరి సత్యనారాయణ (చిన్న )తెలిపారు . ఈ మేరకు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు .ఈ సందర్భంగా కొల్లూరి చిన్నా మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి, నిజాయితీ నిబద్ధత గల ఏకైక నాయకుడు రోశయ్య అని అన్నారు. రోశయ్య రాజకీయ ప్రస్థానం కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే యువతకు ఆదర్శం కావాలన్నారు. రాజకీయ ఉద్దండుడు కురువృద్ధుడు దేశ రాజకీయాలను సైతం తనను చూసి నేర్చుకునే విధంగా వ్యవహరించిన ఏకైక వ్యక్తి రోశయ్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు జల్లూరి రంగారావు, తుమ్మలపల్లి కేశవరావు, జల్లూరి రమేష్, పాదర్తి శ్రీను, కొల్లిపర రవి, చిలకల సాయి తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ తీవ్రత దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండాలి



కలెక్టర్ రాజాబాబు

## ఎమ్మెల్యే సింహాద్రి, జిల్లా ఎస్పీతో కలసి సమీక్ష నిర్వహించిన కలెక్టర్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మిచాంగ్ తుఫాన్ నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఎస్పీ పి జాషువాతో కలసి తుఫాన్ రక్షణ చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో తుఫాన్ వల్ల ఎక్కడా ప్రాణ, పశు నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు చెందిన వారిని తప్పనిసరిగా పునరావాస కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యం ఎక్కడా వర్షంకు తడవకుండా మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు.

**57 పునరావాస కేంద్రాలు ఏర్పాటు**

తుఫాన్ హెచ్చరిక నేపధ్యంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 57 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ రాజాబాబు చెప్పారు. మచిలీపట్నం మండలంలో అత్యధికంగా 21 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా, నాగాయలంకలో 14, కోడూరు 6, కృత్తివెన్ను 5, అవనిగడ్డ 4, మోపిదేవి 3, బంటుమిల్లిలో 4 ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయంకు 1,899 మందిని పునరావాస కేంద్రాలకు తరలించగా, సాయంత్రంలోపు మొత్తం ఏడు వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్టు జిల్లా కలెక్టర్ రాజాబాబు చెప్పారు. ఉదయం పూట టిఫిన్, పాలు, మధ్యాహ్నం, రాత్రి భోజనం, త్రాగునీటిని ఏర్పాటు చేసినట్టు తెలిపా రు. 4,5,6 తేదీలు మూడు రోజుల పాటు ఈ కేంద్రాలు ఉంటాయని, తిరిగి ఇంటికి వెళ్ళే టప్పుడు కుటుంబానికి రూ. 2వేలు, ఒక్కరు ఉంటే రూ. 1,000 పరిహారం ఇచ్చి పంపనున్నట్టు కలెక్టర్ చెప్పారు. ఈ పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలతో పాటు పీహెచ్‌సిల్లో 24 గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నారు.

**రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 600 మంది పోలీసులు**

తుఫాన్ వల్ల కలిగే ఎలాంటి ప్రమాదాలు, నష్టాలను ఎదుర్కొనేందుకు జిల్లా వ్యాప్తం రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు మొత్తం 600 మంది పోలీసులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ పి జాషువ చెప్పారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరిగినా, ఎలాంటి విపత్తు సంభవించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇస్తే రక్షణ చర్యలు చేపడతారని ఎస్పీ తెలిపారు.

**ధాన్యం కొనుగోలుకు చర్యలు : ఎమ్మెల్యే సింహాద్రి**

నూర్పిడి చేసిన ధాన్యంతో పాటు, తుఫాన్ వల్ల దెబ్బతిన్న ధాన్యంను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. ధాన్యం సేకరణలో నిబంధనలు సడలించాలని రైతులు పంటను రక్షించుకునేందుకు అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన, ఎమ్మెల్యే సింహాద్రి, జిల్లా ఎస్పీ జాషువాతో కలిసి నాగాయలంక మండలంలోని పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను పరిశీలించారు.



## పులవర్తి అంజమ్మకు ప్రముఖుల ఘన నివాళి



**నందిగామ, డిసెంబర్ 4, మేజర్ న్యూస్:** పట్టణంలోని రైతుపేట పదవ వార్డులో టీడీపీ పట్టణ అధ్యక్షులు పులవర్తి నరసింహారావు సతీమణి, సీనియర్ న్యాయవాది పులవర్తి చిన్న కోటేశ్వరరావు తల్లి మాజీ కౌన్సిలర్ పులవర్తి అంజమ్మ అనారోగ్య సమస్యతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం అంజమ్మ పార్థివ దేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్నా) తదితర ప్రముఖులు సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, నందిగామ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాలుగా భారతదేశ ఆరోగ్యాన్ని పెంపొందిస్తోన్న టాటా సాల్ట్

**గుంటూరు మేజర్ న్యూస్ :** నాలుగు దశాబ్దాలుగా, భారతీయ గృహాల్లో విశ్వాసం, స్వచ్ఛతకు చిహ్నంగా టాటా సాల్ట్ ఉంది. ఇప్పుడు, మరింత గొప్ప నమ్మకంతో, దాని విలువైన వినియోగదారుల శ్రేయస్సు కోసం దాని స్థిరమైన అంకితభావాన్ని పునరుద్ఘాటించింది. టాటా సాల్ట్ ప్రతి వ్యక్తి యొక్క శ్రేయస్సు కోసం అధిక నాణ్యత, అయోడైజ్డ్ ఉప్పును అందించడానికి కట్టుబడి ఉంది. ఈ ప్రాంతంలోనే కాకుండా భారతదేశం అంతటా శుద్ధీకరణ, నాణ్యతకు బెంచ్ మార్క్ నిలిచిన టాటా సాల్ట్, ప్రయోగశాల పరీక్ష ద్వారా ధృవీకరించబడినట్లుగా, దేశవ్యాప్తంగా ఉప్పుల్లో అత్యున్నతంగా శుద్ధి చేయబడిన సాల్ట్ గా ఉద్భవించింది. పరిశ్రమలో అగ్రగామిగా, టాటా సాల్ట్ దేశం యొక్క శ్రేయస్సు పట్ల తమ నిబద్ధతకు గర్విస్తోందని టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్యాకేజ్డ్ ఫుడ్స్ ఇండియా ప్రెసిడెంట్ దీపికా భాన్ పేర్కొన్నారు. భారతదేశం యొక్క అయోడైజేషన్ ప్రయాణానికి మార్గదర్శకుడిగా, టాటా సాల్ట్ అయోడిన్ లోపంపై దేశం యొక్క పోరాటంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ బ్రాండ్ భారతదేశంలో అయోడైజేషన్ ఉద్యమంలో ముందంజలో ఉందని అన్నారు. పిల్లలలో మానసిక అభివృద్ధికి కీలకమైన, సూక్ష్మపోషకమైన అయోడిన్ను సరైన మొత్తంలో లభిస్తుందనే హామీ టాటా సాల్ట్ ఇస్తుందని చెప్పారు.

## అన్ని పాఠశాలలకు సెలవు

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మిచౌంగ్ "తుఫాను పరిస్థితి దృష్ట్యా, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారి ఉత్తర్వులు, కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, కృష్ణా, మచిలీపట్నం వారి ఆదేశాల మేరకు తేదీ. 05.12.2023న కూడా తుఫాను పరిస్థితి దృష్ట్యా కృష్ణా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు (అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలకు) సెలవు ప్రకటించుట జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి, తాహెరా సుల్తానా ఒక ప్రకటనలో తెలిపారు. కావున, జిల్లా వద్ద అందరు ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, అన్నీ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకొనవలసినదిగా జిల్లా విద్యా శాఖాధికారి, కృష్ణా, మచిలీపట్నం వారు తెలియజేశారు.

## కవులూరులో బొర్రా కృష్ణారావు సంస్మరణ కార్యక్రమం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కవులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్దలు బొర్రా కృష్ణారావు సంస్మరణ కార్యక్రమం సోమవారం కవులూరు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం కవులూరు గ్రామానికి విచ్చేసి బొర్రా కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ తుఫాన్ కంట్రోల్ రూమ్‌లో.. మూడు షిఫ్టులలో సిబ్బందికి విధులు



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : మచిలీపట్నం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు అందుబాటులో ఉండేలా ఈనెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు సిబ్బందికి 3 షిఫ్టులలో విధులు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ జిల్లా కలెక్టరేట్లో తుఫాను పరిస్థితులను పర్యవేక్షించేందుకు 08672-252572, 252000 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 3 షిఫ్టులలో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండవ షిఫ్ట్, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మూడో షిఫ్టు లో సిబ్బందికి కలెక్టర్ విధులు కేటాయించారు. ఈనెల 3వ తేదీ నుండి 7వ తేదీ ఉదయం వరకు కంట్రోల్ రూమ్ లో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఘనంగా కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతి



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్యవైశ్య పెద్దలు దివంగత నేత కొణిజేటి రోశయ్య 3వ వర్ధంతిని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి ప్రార్థన మందిరములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి చిన్నా మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి, నిజాయితీ నిబద్ధత గల ఏకైక నాయకుడు రోశయ్య అని అన్నారు. రోశయ్య రాజకీయ ప్రస్థానం కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే యువతకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు జల్లూరి రంగారావు, తుమ్మలపల్లి కేశవరావు, జల్లూరి రమేష్, పొదర్తి శ్రీను, కొల్లిపర రవి, చిలకల సాయి తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కారణంగా 10న మార్చిన బస్సు యాత్ర



నందిగామ, డిసెంబర్ 4, మేజర్ న్యూస్: అల్పపీడనం కారణంగా ఏర్పడిన తుఫాను వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడినందున నందిగామలో ఈరోజు నిర్వహించవలసిన సామాజిక సాధికార బస్సు యాత్రను వాయిదా వేస్తున్నట్లు శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ తెలిపారు.తిరిగి డిసెంబర్ 10 వ తేదీన నందిగామలో సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.కావున నియోజకవర్గ ప్రజలు, స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, సానుభూతిపరులు డిసెంబర్ 10 వ తేదీన నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

## అన్నదానం, వస్త్ర దానంలో బొమ్మసాని



జి.కొండూరు మేజర్ న్యూస్ : తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులు బొమ్మసాని సుబ్బారావు ఇబ్రహీంపట్నం మండలం కోటికలపూడి గ్రామంలో అయ్యప్ప స్వాముల అన్నదాన కార్యక్రమం, వికలాంగులకు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యి కోటికలపూడి గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు. పలే శ్రీనివాసరావు పలే చిన్నవెంకటేశ్వరవు సాంబయ్య కాకి శ్రీనివాస్, ఇబ్రహీంపట్నంకు చెందిన టిడిపి నాయకులు కొయ వేంకటరావు డాక్టర్ దాసు నగేష్ కోట్వేశ్వరావు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# ప్రమాదకరంగా మారిన గుంటలు



### బేంబేలు ఎత్తుతున్న వాహన చోదకులు

### పట్టించుకోని ఆర్&బి అధికారులు

వత్సవాయి డిసెంబర్ 4మేజర్ న్యూస్ : మండల కేంద్రంలో లింగాల గ్రామంలో పెద్ద ఎత్తున ప్రమాదకరంగా గుంటలు పడి వాహన చోదకులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారు.ఈలాంటి ప్రమాదకరమైన గుంటల వల్ల నిండు ప్రాణాలు బలైన విషయం విధితమే. ఒక్క ప్రక్క ప్రమాదకరమైన గుంటలు మరో ప్రక్క మునేరు కాలువ ప్రాణం అరిచేతి పెట్టుకొని ప్రాణ భయంతో వాహన చోదకులు అల్లాడిపోతున్నారని మాట్లాడుకుంటున్నారు. ప్రతి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు ఆ రోడ్లో రాకపోకలు సాగిస్తుంటాయి. అకాల వర్షాలు వల్ల భారీ గుంటలు పడి రోడ్ అధ్వానంగా తయారై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న అటు అధికారులు గాని, ఇటు ప్రజా ప్రతినిధులు గాని నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరించడం పట్ల ప్రజలు విస్మయంలో పడ్డారు. రాత్రులు పగలు అనే తేడా లేకుండా ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై కాళ్ళు, చేతులు విరిగి ఎన్నో ఇబ్బందులు గురౌతున్నారని ప్రజలు వాపోతున్నారు.

ప్రతి రోజు వత్సవాయి నుండి జగ్గయ్యపేటకు పదుల సంఖ్య లో ప్రజా ప్రతినిధులు, అధికారులు రాకపోకలు సాగిస్తున్న వారికి ఆ ప్రమాదకరమైన గుంటలు కనబడటలేదా అని ప్రజలు ఆశ్చర్య పోతున్నారు. నాయకులు ప్రజలను మభ్య పెడుతూ ప్రభుత్వం అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రెండు కళ్ళు అని చెపుతూనే ప్రజలను మోసం చేస్తున్నారే విషయం తేటతెల్లం అయిందని చెప్పుకుంటున్నారు.వర్షకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతింటే ఇంతవరకు ఆర్ అండ్ బి అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని మరమ్మత్తులు చేయించకపోవటంలో అంతర్యామేమిటో ప్రజలకు అర్థం కావటం లేదు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికే తప్ప అభివృద్ధి శూన్యం అని ప్రజల గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా పాలకులు గాని, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోని రోడ్లు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలు నివారించాలి ప్రజలు వారిని కోరారు.

# బాధ్యతలను మరచిన ప్రభుత్వం



అవనిగడ్డ మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం భాధ్యలను మరచి ప్రవర్తిస్తుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పర్యటించారు. నాగాయలంక, కోడూరు మండలాలతో పాటు అవనిగడ్డ మండలంలోని పలు తీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో కొందరికి మాత్రమే వసతి, భోజన సౌకర్యం కల్పించారని, గత 4 రోజులుగా వేటకు వెళ్ళకపోవడంతో పాత ఉపకాలి గ్రామంలో తినడానికి తమకి తిండి కూడా లేదని గ్రామస్థులు బుద్ధప్రసాద్ దగ్గర వాపోయారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, ఏదైనా విపత్తు సంభవిస్తే గ్రామాల నుండి మండల కేంద్రాలకు సరైన రహదారుల సౌకర్యం కూడా లేదని, సముద్రపు కరకట్టలు సైతం బలహీన పడ్డాయని వాటిని కనీసం మరమత్తులు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉండగా, వాటి నిర్వహణను ప్రభుత్వం మరచిపోయిందన్నారు. తుఫానులు వచ్చినప్పుడు తీరప్రాంత ప్రజల రక్షణకు గతంలో తుఫాన్ షెల్టర్లు నిర్మిస్తే అధికార పార్టీ వచ్చిన తరువాత వాటిని కూల్చారే గానీ వాటిని నిర్మించలేదన్నారు. నేడు తుఫాన్ కారణంగా దివిసీమ వ్యాప్తంగా గొర్రెలు, మేకలు, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటే ఎక్కడికి తరలించాలో కూడా అర్థం కానీ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వానికి ముందు చూపు ఏ మాత్రం లేదని ప్రభుత్వం అంటే ప్రజలను భాధ్యతగా తీసుకుని ముందు చూపుతో వ్యవహరించాలని మండలి సూచించారు. మండలి వెంట కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ ఉన్నారు.

### వరుణుని ఆశీర్వాద జల్లుల మధ్య

# జగనన్న ఇళ్లకు శంకుస్థాపనలు





జి.కొండూరు మేజర్ న్యూస్ : ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్ లో గుంటుపల్లి గ్రామానికి చెందిన మూడో ఆప్షన్ ఎంచుకున్న లబ్ధిదారులతో ఆ వరుణ్ దేవుని ఆశీర్వాదపు జల్లుల మధ్య ఆ పేదవాని సొంతింటి కల నెరవేర్చాలనే పట్టుదలతో దగ్గరుండి లబ్ధిదారులతో ఇబ్రహీంపట్నం మండల వైఎస్సార్సీపీ నాయకులు పొలదుగు దుర్గా ప్రసాద్ భూమి పూజ కార్యక్రమాలను పూర్తి చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైతే మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చి వారి కళ్ళల్లో ఆనందం చూడాలని ఆశించారు మా గుంటుపల్లి గ్రామంలో ఉన్న ప్రతి లబ్ధిదారు కన్నుల్లో కూడా అదే ఆనందం చూడాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఇబ్రహీంపట్నం మండలం హౌసింగ్ ఏ.ఈ నాగరాజు,ఫీల్డ్ ఆఫీసర్ లావణ్య నాయక్, గుంటుపల్లి గ్రామ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# స్పందన అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించండి

## స్పందనలో 80 అర్జీలు నమోదు...

## జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్,



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** స్పందన ద్వారా స్వీకరించిన అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి తమ సమస్య పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి రావడం జరుగుతుందన్నారు. స్పందన పై అర్జీదారుడు పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా అధికారులు సమస్యలను పరిష్కరించుటకు చొరవ చూపాలన్నారు. అర్జీదారుడు మరోక సారి స్పందన కార్యక్రమానికి వచ్చి సమస్య పరిష్కారం కాలేదనే బాధను వ్యక్త పరిచే పరిస్థితి లేకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన్నప్పుడే స్పందన లక్ష్యం నేరవేరుతుందన్నారు. ప్రతి అర్జీని అధికారులు వ్యక్తిగత సమస్యగా భావించి పరిష్కార మార్గం చూపాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీ పరిష్కారానికి సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహాశీల్ధార్లతో వర్చువల్‌గా మాట్లాడి సమస్యను వారికి వివరించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పందనలో రెవెన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అర్జీలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి నిర్ణిత కాల పరిమితిలోగా పరిష్కరించాలన్నారు. సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుని కాలయాపన లేకుండా పరిష్కారం చూపాలన్నారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం కూడదని, నమోదు అవుతున్న వినతులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. నేటి స్పందనలో 80 వినతులు నమోదు కాగా వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 38, పోలీస్ 9, యంఎయుడి 6, సహకర శాఖ 6, డిఆర్‌డిఏ 4, పంచాయతీరాజ్ 3, హెల్త్ 3, ఆర్‌డబ్ల్యుఎస్ 2, ఆర్అండ్‌బి 1, మార్కెటింగ్ 2, ఏపిఎస్‌పిడిసిఎల్ 1, సోషల్ వెల్ఫేర్ 1, సర్వే 1, ఇరిగేషన్ 1, విభిన్నప్రతిభావంతుతు 1, బ్యాంకుకు సంబంధించి 1 అర్జీలు నమోదయ్యాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఈ స్పందన కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడి కె.శ్రీనివాస్, ఐసిడిఎస్ పీడి జి. ఉమాదేవి, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ యం విజయభారతి, జిల్లా విద్య శాఖ అధికారిని సివి రేణుక, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం. రుక్మాంగదయ్య, హౌసింగ్ పిడి రజినీ కుమారి, పశుసంవర్ధక శాఖ జెడి కె. విద్యాసాగర్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలాజీ కుమార్, డ్వామా పిడి జె. సునీత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీపీ కార్యాలయంలో "స్పందన" కార్యక్రమంలో "71" ఫిర్యాదులు.



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు ఈస్ట్ డి.సి.పి. విశాల్ గున్ని స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుండి వివిధ సమస్యలు, వినతులు, విజ్ఞప్తులకు సంబంధించి నేరుగా భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు ఫోన్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 16 ఫిర్యాదులు, సివిల్ వివాదాలకు సంబంధించినవి 12 ఫిర్యాదులు, వివిధ మోసాలకు సంబంధించినవి 09 ఫిర్యాదులు, ఇంటి అద్దె విషయం సంబంధించినవి 02 ఫిర్యాదులు, త్వరిత గతిన పరిష్కరించాల్సిన కేసులకు సంబంధించి 01 ఫిర్యాదు, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలుకు, సంఘటనలకు సంబంధించినవి 15 ఫిర్యాదులు, మొత్తం71 ఫిర్యాదులును డి.సి.పి. విశాల్ గున్ని స్వయంగా స్వీకరించారు.

## సకలసౌభాగ్యాల కోసం హోమాలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** సువర్చల సహిత ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు బృందావన వేణుగోపాల స్వామి వారి ఆద్వర్యంలో వాయు హోమం నిర్వహించారు. లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయ ఆవరణలో గల ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం బహుళ సప్తమి మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని మహా సుదర్శన హోమం, నవగ్రహ శాంతి హోమం, ధనవంతరి హోమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సువర్ణల సమేత ఆంజనేయ స్వామివారికి వేకువ జామునే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సింధూరార్చనలు, పుష్పార్చన, పుష్పయాగాలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గోని 108 సార్లు హనుమాన్ ఛాలీసా పారాయణం చేసి సకల సౌభాగ్యాలు కలుగచేయాలని కోరుతూ వాయుహోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి, పండితుల ఆశ్వీచనాలు చేశారు. ఆగమ పండితులు బృందావన నరసింహమూర్తి, ఇబ్రహీం పట్నం అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు అనంతర రామాచార్యులు, రఘుశాస్త్రాచా ర్యులు పాల్గోని భక్తులకు తీర్థప్రసాదాలను వితరనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కార్యక్రమాలను తిలకించి తీర్థఅన్నప్రసాదాలను నిర్వహించగా 400 మంది భక్తులకు అన్నప్రసాదాలు అందచేశారు.

## బాలశివశంకర భగవాన్‌కు విశేష పూజలు





**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాలశివశంకర్ భగవాన్‌కు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణ చిరు వోల్లంక, మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీపాయల నడుమ స్వయంగా వెలసిన బాలశివశంకర్ భగవాన్‌కు దక్షిణాయనం, శరత్ ఋతువు, కార్తీకమాసం, బహుళ సప్తమి తిధిని పురస్కరించుకుని కార్తీక మూడవ సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ, ఆలయ అర్చకులు కాళీభట్ల సుబ్బయ్యశాస్త్రి లు ముందుగా కృష్ణానదీజలాలలతో అభిషేకించి నవవిధ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ముందుగా స్వామి వారికి నాగవల్లి అర్చనతో పూజలు నిర్వహించారు. భక్తులు సుదీర్ఘ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో గల గణపతి, కుమారస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసి మ్రొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వార్లను దర్శించుకుని తీర్థ అన్నప్రసాదాలను స్వీకరించారు.దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

## లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు రావాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు పిలుపునిచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గత రెండు రోజుల నుండి ఎడతెడపి లేకుండా వర్షాలు కురుస్తుండగా మరో ప్రక్క అధికారులు తుఫాను హెచ్చరికలు జారీ చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలి రావాలని పిలుపు నివ్వడంతో సోమవారం మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎం.పి.టి.సి లు బొప్పన బాణు, కటికల వసంత్‌లు ఇంటింటికి వెళ్ళి వారి స్థితిగతులను తెలుసుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. మండలంలోని నిరుపేదలకు, యానాదులకు షెల్టర్‌లో తలదాచుకున్న వారికి భోజనం ప్యాకెట్లు సైతం పంపిణీ చేసి వెంటనే సురక్షిత ప్రాంతాలకు రావాలని కోరారు. ఈయన వెంట పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..

## ఘనంగా శివుడికి అభిషేకాలు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** కార్తీక సోమవారం పురస్కరించుకొని సోమవారం మచిలీపట్నం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ ఉమా సహిత సహస్ర లింగేశ్వర శివలింగానికి ఉదయం నుండి పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం అర్చకులు నారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలు దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ 15వ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజదంపతులు, శ్రీపాద శ్రీపాద రంగనాయకులు సంక మల్లికార్జునరావు టి రమేష్ కలిసి సహస్ర శివలింగాలుతో ఏర్పాటు చేసిన భారీ శివలింగానికి ఆవు పాలు, అవు నెయ్యి, తేనె, పంచదార, వివిధ పళ్ళ రసాలు, వట్టేరు వేళ్ళు, పన్నీరు పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు చేసి స్వామివారిని సుందరంగా అలంకరించారు. అనంతరం శివలింగం ముందు కార్తీక దీపోత్సవాలను వెలిగించి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

## యాక్ట్ జీవోను రద్దు చేయాలని ఆర్డీవోకి వినతి



**నందిగామ, డిసెంబర్ 4, మేజర్ న్యూస్ :** కోర్టు విస్తృత అధికారాలను, రాజ్యాంగ హక్కులకి నష్టం కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో నెంబర్ 27/2023ను రద్దు చేయాలని నందిగామ ఆర్డీవోకి వినత పత్రం న్యాయవాదులు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్ జీవో నెంబర్ 27/2023 సివిల్ కోర్టు అధికారాలను, రాజ్యాంగా అధికారాలను, కక్షిదారుల హక్కులను, కాలరాస్తూ దొడ్డి దారిలో తీసుకువచ్చిన చీకటి జీవోను రద్దు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగ హక్కులను కాపాడాలని, ప్రజలకు కక్షిదారులకు భంగం కలిగించే జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లాడెవలప్మెంట్ కోఆర్డినేషన్, పర్యవేక్షణ మోనిటరింగ్ కమిటీ సభ్యులు ఎక్కిరాల హనుమంతరావు, హైకోర్టు న్యాయవాది,జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సెక్రటరీమెట్టెల ఆంజనేయులు న్యాయవాది, నందిగామ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## తుఫాను కారణంగా జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు ఇంటర్, డిగ్రీ కళాశాలలకు శెలవు

జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** మిచౌంగ్ తుఫాను కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందన్నారు. ఈ నేపథ్యంలో విస్తారంగా కురుస్తున్న వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్త చర్యలలో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు 5వ తేదీ మంగళవారం శెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం శెలవు దినంగా ప్రకటించామని మంగళవారం అంగన్వాడీ కేంద్రాలకు శెలవు ప్రకటించినందున గర్భవతులు, బాలింతలు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాలకు తరలి రావ్వొద్దని కోరారు. అలాగే పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలకు శెలవు ప్రకటించినందున యజమాన్యాలు తగు చర్యలు తీసుకొని శెలవు దినాన్ని పాటించాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## వారం రోజుల్లో వైఎస్ఆర్ బీమా పథకం క్లైయిమ్‌ల పరిష్కారం

**2023, జులై 16 నుంచి ఇప్పటివరకు 80 క్లైయిమ్‌ల నమోదు**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**

**విజయవాడ బ్యూరో, డిసెంబర్ 4, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా అన్ని ధ్రువపత్రాలతో క్లైయిమ్ నమోదు చేసిన వారం రోజుల్లోనే నామినీ బ్యాంకు ఖాతాకు నగదు జమవుతోందని.. పథకం ద్వారా జిల్లాలో 2023, జులై 16 నుంచి ఇప్పటివరకు 80 క్లైయిమ్‌లు నమోదుకాగా 46 క్లైయిమ్‌లను పరిష్కరించి నామినీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయడం జరిగిందని కలెక్టర్ ఎస్.డిల్లీరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆసరాగా నిలబడేందుకు రూ. 5 లక్షల బీమా మొత్తాన్ని అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పథకం అమలవుతోందని తెలిపారు. 2023, జులై 15 వరకు ప్రమాద బీమాను ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలుచేయడం జరిగిందని.. అయితే క్లైయిమ్‌ల పరిష్కారంలో తీవ్ర జాప్యం వల్ల బాధిత కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని గుర్తించి ప్రభుత్వం జులై 16 నుంచి ప్రభుత్వం ద్వారానే బీమా పథకాన్ని అమలుచేస్తున్నట్లు వివరించారు. బీమా క్లైయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించి పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా పథకంతో ప్రయోజనం పొందేందుకు తమ పరిధిలోని సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు.

## సమస్యలను త్వరగా పరిష్కరించండి




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్ లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వచ్చిన 10 ఫిర్యాదులకు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం ఉదయం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 4, పి ఒ (యు.సి.డి.)-1, హెల్త్ విభాగానికి 3, ఎస్టేట్ విభాగానికి 2, మొత్తం కలిపి 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన పాల్గొంటారని తద్వారా ఎటువంటి సమస్యనైనా ఎవరి పరిధిలో ఉన్న పరిష్కారం కచ్చితంగా దొరుకుతుందని అలాగే ప్రతి సోమవారం ప్రతి జోనల్ ఆఫీస్ లో, సచివాలయంలో స్పందన కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని తమ సమస్యలను అధికారులకు తెలియపరచి పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. ప్రజల నుంచి అందుకున్న ఈ ఫిర్యాదులకు సత్వర పరిష్కారాలు ఇవ్వాలని సంబంధిత విభాగం అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ రావు, సిటీ ప్లానర్ జీవి జీ ఎస్ వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, ఏ డి హెచ్ శ్రీనివాస్, ఏ ఓ నరసింహ మూర్తి, ఆర్.యఫ్.ఓ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో స్వచ్ఛంద చేరికలు

**మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా**



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్:** 62వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం పెద్ద ఎత్తున 50మందితో తెలుగుదేశం పార్టీలోకి స్వచ్ఛందంగా చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోసభ్యులు, సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని టీ మేరీ, వేమగిరి గణేష్ ఆధ్వర్యంలో చేరిన సునీల్ కుమార్,బిచేరిన నాగరాజు, ధనలక్ష్మి, బి స్వప్న, యూ.వెంకటేశ్వర రావు, టీ కార్తిక్,అప్పారావు, గణేష్,సి హెచ్ సాయి,జె రాజేశ్వరి, జె సత్యవతి, చిన్ని,సుకరత్నం, స్వర్ణ దుర్గ తదితరులకు కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ వైసీపీ స్వార్థపూరిత రాజకీయాలకు వందలాది కుటుంబాలు బలయ్యాయని, వచ్చే ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పసుపుజెండా ఎగరేయడానికి, ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అన్నివర్గాలకు సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పేద, బడుగు,బలహీన వర్గాల పక్షాన తెలుగుదేశంపార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని, నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యతనిచ్చి అన్నివిధాలా అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. తెలుగుదేశంపార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పూర్ టూ రిచ్ నమ్మకం భరోసాను కల్పించే విధంగా వివరించారు.

ఏ విధంగా ప్రజలు తెలుగుదేశం పార్టీకి చంద్రబాబు నాయుడు కి ప్రజలు బ్రహ్మరథం పడుతూ,బాబు వెంటే ఉంటున్నారని దీనిని ఓర్వలేని జగన్ రెడ్డి పిచ్చి చేష్టలు చేస్తున్నాడని,దమ్ముంటే ఎదుర్కోవాలని,దొంగ దెబ్బ తీయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, సెంట్రల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఆరుమళ్ళ గోపిరెడ్డి, డివిజన్ ఇంచార్జి పైడి శ్రీను,డివిజన్ అధ్యక్షులు తొట్టెంపూడి ఉదయ్ శంకర్, కొమ్మినేని రమేష్,కత్తులు దుర్గారావు,రావిపాటి శివ, తదితరులు పాల్గొన్నారు.

# కోతకోసి బయటికి వచ్చిన ధాన్యం చెడిపోకుండా రక్షణ చర్యలు తీసుకోండి





## ఏవోతో కలిసి రామనపూడి, బిళ్లపాడు గ్రామాల్లో పర్యటించిన ఏడీఏ రమాదేవి

**గుడివాడ, మేజర్ న్యూస్:** వరి కోత కోసి బయటికి చేర్చుకున్న ధాన్యం వాతావరణ పరిస్థితులతో చెడిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని గుడివాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమాదేవి రైతులకు సూచించారు. ఏవో అనంత లక్ష్మితో కలిసి ఏడీఏ గుడివాడలోని రామనపూడి, బిళ్లపాడు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పరిధిలోని గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్లో 38993 ఎకరాల్లో వరి సాగు చేసినట్టు చెప్పారు. ఇందులో 10066 ఎకరాల్లో కోతలు కోసినట్టు చెప్పారు. ఇందులో 4360 ఎకరాల్లో వరి పనలపై ఉన్నదన్నారు. కేవలం 400ఎకరాల్లో పైరు కుప్పలుగా వేసుకున్నట్టు చెప్పారు. మిషన్లతో కోతకోసిన మరో 5306 ఎకరాల్లోని ధాన్యాన్ని రైతులు బయటికి తరలించినట్టు చెప్పారు. తుఫాను ప్రభావంతో కురిసే వర్షాలు, తేమ గాలులకు ఈ ధాన్యం చెడిపోకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు మిల్లుల్లో డ్రయ్యర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డులకు తరలించి ఆరబెట్టుకోవచ్చన్నారు. వర్షాలు తగ్గాక కోత కోయకుండా నిలువుమీద ఉన్న పైరు, పనలపై ఉన్న పైరుకు వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచనలతో రక్షణ చర్యలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఏవో అనంత లక్ష్మి, సిబ్బంది ఆమెతో పాల్గొన్నారు.

# ఔట్ ఫాల్ డ్రైన్లలో చెత్తను జేసీబీలతో తొలగిస్తున్న పనితీరు పరిశీలన



**లోగట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే గుర్తించండి**

**నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సోమవారం ఉదయం నగరంలోని మిల్క్ ప్రాజెక్ట్, గుణదల, గుంట తిప్ప దగ్గర ఉన్న అవుట్ఫాల్ డ్రైన్స్ ను పరిశీలించారు. మిచౌంగ్ తుఫాను కారణంగా నగరంలో విస్తారంగా వర్షాలు ఉంటాయి కాబట్టి, డ్రైన్లు నిండిపోయే పరిస్థితులు తలెత్తకుండా, ఎక్కువ మొత్తంలో పేరుకుపోయిన చెత్తను జెసిబి లతో ఆ చెత్తను తొలగిస్తున్న పనితీరును పరిశీలించారు. తుఫాన్ తీవ్రత పెరుగుతున్న సందర్భంలో డ్రైన్స్ నుంచి ఎటువంటి ముంపు ప్రజలకు కలగకుండా ఉండాలని ఉద్దేశంతో ఆట్ ఫల్ డ్రైన్స్ లో నుంచి పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్, గుర్రపుడెక్క ఎప్పటికప్పుడు పరిశుభ్రపరిచి ఆ ప్రాంతాల్లో గల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, లోగొట్టు ప్రాంతాల్లో గల నివాసులకు ముందస్తుగా సమాచారం అందించి వాళ్లకు ఆ ప్రాంతంలో గల స్కూల్లో కల్పించిన పునరావాస సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, వారు ఏ ప్రాంతానికి చెందిన వారేనా వాళ్ళ వాలంటీర్ లేదా వీఆర్వో ద్వారా పాఠశాలలో కలిపించిన పునరావాసం గురించి తెలుసుకోవచ్చానన్నారు. నగరం లో ఉన్న లోగట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే గుర్తించి వాళ్లను పునరావాసం కేంద్రాలలో వసతి కల్పించాలని అన్నారు. ఈ పర్యటనలో కమిషనర్ తో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి జోనల్ కమిషనర్ రవి చంద్ ఉన్నారు.



# మనస్సుతో విని మంచి మార్గం చూపించండి



విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న చెప్పుకోలేని సమస్యలను మనస్సుతో విని మంచి పరిష్కార మార్గం చూపించడం ద్వారా ప్రతికూల ఆదోళన విరమించుకుని ప్రశాంత మైన జీవితాన్ని గడిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు కోరారు. మహిళాల సమస్యల పరిష్కారం కొరకు ఏర్పడిన మనశ్విని కాన్సెప్ట్ పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నగరంలోని ఆయన విడిది కార్యాలయం వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో నగరపోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్‌లు కలిసి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేము మీతో ఉంటాం మీకు సహాయం చేస్తామంటూ మనశ్విని కాన్సెప్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో అనేక మంది మహిళలు పలు సమస్యలతో సతమతమవుతారన్నారు. ఎదురయ్యే సమస్యలు కొన్ని చెప్పుకోలేక, పరిష్కారం దొరకక నిరాశ నిస్పృహలతో ప్రతికూల ఆలోచనలు చేస్తారన్నారు. బాలికల పై జరుగుతున్న వేధింపులు మహిళాలు పై జరుగుతున్న హింసాత్మాక సంఘటనలు నివారించేందుకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలను చేస్తున్నప్పటికి వాటిని వినియోగించుకోలేక సమస్యలకు పరిష్కారం దొరకక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూసున్నామన్నారు. మనశ్విని కాన్సెప్ట్ ద్వారా బాలికలు, మహిళలు సమస్యలను మనస్సు పెట్టి విని వారికి మంచి మార్గం చూపడం ద్వారా అనుకూల మైన ఆహ్లాదకర వాతావారణం కల్పించి జీవితం ఆనందమయం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ మహిళ కమిషన్ మాజీ డైరెక్టర్ ఆర్. సూయజ్ మాట్లాడుతూ మహిళలు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను మనస్సుతో విని పరిష్కారం మార్గం చూపాలనే ఏకైక లక్ష్యంతో మనశ్విని కాన్సెప్ట్‌ను స్వచ్ఛందగా ప్రారంభించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. లైంకిక వేధింపులు,అత్యాచారం, గృహ హింస వంటి చెప్పుకోలేని సమస్యలతో బాధపడే బాలికలు, మహిళలు మనశ్విని దృష్టికి తీసుకువస్తే వారికి పూర్తి సహాయ సహకారం అందించేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. మనశ్విని కాన్సెప్ట్ ద్వారా మహిళాలలో ఆందోళన, సమస్యలు పరిష్కారం, ఆత్మహత్య ధోరణుల నివారణలపై కౌన్సిలింగ్, బృంద చర్చలు (గ్రూప్ డిస్కర్షన్స్), క్షేత్రస్థాయి పర్యాటనలో అవగాహన సదస్సులు, నిర్వహించనున్నామన్నారు. మనశ్వినితో మనస్సు పంచుకునే మహిళల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని నిర్భయంగా ముందుకు వస్తే మేము అండగా ఉండి సహాయం చేస్తామన్నారు. సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఇన్స్టాగ్రామ్ లేదా 9701056808 నెంబర్ ద్వారా సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి, పాత ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మానసిక వైద్యురాలు డా. స్వరాజ్య లక్ష్మి, చేయూత ఎడ్యుకేషన్ సెంటర్ ప్రిన్సిపల్ టి. కృష్ణకుమారి, ప్యాషన్‌నెట్ చెంజ్ మేకర్ ఎ. అనూష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని యస్ నాగమణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండండి



**పంట, ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చర్యలు తీసుకోండి..**

**జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు.**

విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని అధికారులు నిరంతరం అప్రమత్తంతో పంట, ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆదేశించారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని చేపట్టవలసిన చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియోకాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీ రావు, అనంతరం జిల్లా అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను తీరం దాటే సమయంలో జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తాయని హెచ్చరికలను పరిగణంలో తీసుకుని అధికారులందరు అప్రమత్తంతో ఉండాలన్నారు. ఇప్పటికే జిల్లా రైతులు వరికోతలు చేపట్టకుండా నివారించడం జరిగిందన్నారు. 41,163 హెక్టారులలో రైతులు వరి పంటను చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో 6,520 హెక్టారులో వరికోతలు కోయడం జరిగిందన్నారు. 45,108 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి కాగా ఇందులో 12,993 మెట్రిక్ టన్నులు బహిరంగ మార్కెట్ ద్వారా రైతులు అమ్మకోవడం జరిగిందని మరో 28 వేల మెట్రిక్ టన్నులు గోడౌన్లోను సురక్షిత ప్రాంతంకు తరలించడం జరిగిందన్నారు. 2,391 మెట్రిక్ టన్నులు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. 3వ తేదిన వాతావారణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 324 మెట్రిక్ టన్నులు ఆఫ్లైన్, 200 మెట్రిక్ టన్నులు ఆన్లైన్ ద్వారా కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. 1200 మెట్రిక్ టన్నులు ధాన్యం కుప్పలు వేసి ఉందని వాతావారణం అనుకూలించిన వెంటనే తేమ శాతం ఉన్నప్పటికి ఆర్బికెల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాపాతం కురిసే అవకాశం ఉ న్నందున కొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొండ చర్యలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి సమీపంలో నివాసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒపెన్ డ్రైన్స్ పై దృష్టి పెట్టి వర్షపు నీరు పారేలా చర్యలు తీసుకుని నిల్వ ఉ ండకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున హోర్డింగ్ పై దృష్టి పెట్టి హోర్డింగ్ దెబ్బతిన్నప్పటికి సమీపంలో ఎటువంటి నష్టాం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతం, గ్రామీణ ప్రాంతాలలో పూరిగుడిసెలు, పురాతన గృహాలను గుర్తించి నివాసితులను అప్రమత్తం చేయాలన్నారు. విపత్కర పరిస్థితులలో ఎదురై బాధితులను తరలించవలసి వస్తే ముందుగానే పునరవాస కేంద్రాలను గుర్తించి మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్లో నగరపోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి యస్. నాగమణెమ్మ, ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, జిల్లాకు చెందిన ఆర్డీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా కోటి దీపోత్సవ వేడుకలు



విజయవాడ, మేజర్ న్యూస్ : మిల్క్ ఫ్యాక్టరీ వద్ద గల సీవీఆర్ ప్లై ఓవర్ బ్రిడ్జి పక్కనున్న శివశక్తి నగర్‌లోని అస్త్ర అపార్ట్మెంట్ సెల్లారులో సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా కోటి దీపోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్తీక మాసం మూడో సోమవారం గూడేల వెంకట దుర్గా రమణ,నాగలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అపార్ట్మెంట్ లోని మహిళలు పాల్గొన్నారు. పూజారి వంకా సురేష్ శర్మ వేద మంత్రోచ్చరణలతో ఎంతో భక్తిశ్రద్దలతో జరిగిన ఈ వేడుకల్లో కార్తీక మాసం... అదీను సోమవారం కార్తీక దీపాలు, కార్తీక నోముల ప్రాధాన్యత ని పూజారి వంకా సురేష్ శర్మ వివరించారు. గతేడాది కూడా ఇదే అపార్ట్మెంట్ లో ఇదే దంపతులు ఆధ్వ ర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూజలు అనంతరం నాగల క్ష్మి చేతులు మీదుగా ముత్తైదువులకు పసుపు కుంకుమ, తాంబూలం అందిం చారు. అలాగే అపార్ట్మెంట్ వాసులు అందరికీ ప్రసాదం, అల్పాహారం, పంపిణీ చేశారు.

## లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన డీసీపీ



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : తీవ్రమైన మీచాంగ్ తుఫాన్ కారణంగా ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిదిలోని నదీతీర ప్రాంతాలలో, లోతట్టు ప్రాంతాల లోని ప్రజలను అప్రమత్తం చేయాలనీ సీపీ కాంతి రాణా టాటా ఇచ్చిన ఆదేశాల మేరకు రూరల్ డి.సి.పి. అజిత వేజెండ్ల, క్రైమ్ ఏ.డి.సి.పి. పి.వెంకటరత్నం ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి నందిగామ, జగ్గయ్య పేట సర్కిల్ పరిదిలోని నదీతీర ప్రాంతాలలో, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అయాప్రాంతాలలోని ప్రజలకు మిచాంగ్ తుఫాన్ నెల్లూరు, మచిలీపట్నం మధ్యలో తీరాన్ని దాటువచ్చని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నందున ప్రజలందరూ గమనించి ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన వారు, లోతట్టు ప్రాంతాలలో ఉన్న వారి కోసం ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్ నందు సురక్షితంగా ఉండాలని, అధిక నీటి ప్రవాహం ఉన్న రోడ్డులు, బ్రిడ్జిలు, వాగులు, నదులు దాటడానికి ఎవరు ప్రయత్నం చేయకూడదని, కృష్ణా నదిలోకి వెళ్ళకూడదని, బలహీనంగా ఉన్న ఇంటి గోడలు, కరెంటు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్, చెట్ల కింద ఉండవద్దు. బలమైన ఈదురు గాలులు వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అన్ని మండలాలలో, నదీతీర ప్రాంతాలలో పోలీసు వారిచే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. మీ సహాయార్థం ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు అని, కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఏ.సి.పి. కె.జనార్ధన నాయుడు, జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.జానకిరామ్, నందిగామ రూరల్ ఇన్స్పెక్టర్ ఐ.వి.నాగేంద్ర కుమార్, నందిగామ టౌన్ ఇన్స్పెక్టర్ జె.ఆర్.కె.హనీష్ బాబు, చిల్లకల్లు ఎస్.ఐ. వి.కృష్ణబాబు, ఫైర్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి రెండు కాళ్ళగా విజయవాడ నగరం



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం ఉదయం పశ్చిమ నియోజకవర్గం పరిధిలో గల 46వ డివిజన్, 142 వ సచివాలయంలో వైఏపీ నెడ్స్ జగన్ కార్యక్రమం, పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, కేవిల్ రావు పార్క్ స్విమ్మింగ్ పూల్ పక్కన ఉన్న వైఎస్సార్సీపి జెండాను పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరంలో ఇప్పుడు ఉన్నటువంటి సీసీ రోడ్లు, పేవర్ బ్లాక్ తో కూడిన డస్ట్ ఫ్రీ రోడ్లు, నీటి సరఫరా, పార్కులు అభివృద్ధికి నిదర్శనమని, సంక్షేమం అభివృద్ధి రెండు కాళ్ళగా విజయవాడ నగరం ముందుకెళుతుందని. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల అరవై తొమ్మిది కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరిందని, రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమం అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు.





# ధాన్యపు లోడులు దించుకోకుండా రైతులను ఇబ్బందిపడుతున్న మిల్లర్లు

**అధికారుల మాటలకు, మిల్లర్ల చేష్టలకు పొంతన లేదని సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి ధ్వజం**






**గుడివాడ, మేజర్ న్యూస్:** అధికారుల మాటలు, మిల్లర్ల చేష్టలు రైతుల పాలిట శాపంగా మారాయని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి ధ్వజమెత్తారు. కోతకోసి లారీల్లో మిల్లులకు తరలించిన ధాన్యం లోడులను మిల్లర్లు దించుకో కుండా కాలయాపన చేస్తున్నట్టు తెలిసి పరిస్థితిని పరిశీలించారు. రైతులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. మిల్లులకు వచ్చే ధాన్యం లోడులను సాయంత్రం 6లోపే దించుకుని రైతులను పంపాలని జిల్లా కలెక్టర్ చెబుతున్నా అమలు కావడం లేదన్నారు. కలెక్టర్, అధికారుల మాటలు మిల్లర్లు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని ఆగ్రహించారు. పలు మిల్లులకు శనివారం చేరిన ధాన్యాన్ని సోమవారం సాయంత్రానికి కూడా దించుకున్న పరిస్థితి లేదన్నారు. తుఫాను ప్రభావంతో లారీల్లో తార్పాల్ తో కట్టిఉంచిన ధాన్యం కూడా ముక్కిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నట్టు చెప్పారు. అలా జరగకపోయినా ఇదే అదునుగా ధరల్లో కోత విధించే అవకాశం ఉంటుందని రైతులు భయపడుతున్నారన్నారు. ధాన్యపు లోడులను సకాలంలో మిల్లర్లు దించుకోపోవడంతో కిరాయికి లారీలను పెట్టడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నట్టు పేర్కొన్నారు. ఆగలేకపోతే భీమవరం, ఆకివీడు ప్రాంతాల్లోని మిల్లులకు తరలించుకొండని దౌర్జన్యం చేస్తున్నట్టు తెలిసిందన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇలా ఉంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. ప్రభుత్వం, కలెక్టర్ ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి చక్కదిద్ది రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో పార్టీ నాయకులు నీలం మురళీకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్‌కి సెలవులు వచ్చాయని చిన్నారులకు సంబరం

### పంట తడిచి నేల పాలౌతుంటే దుఃఖాన్ని దిగమింగుకుంటున్న రైతన్నలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తుఫాను ప్రభావంగా పాఠశాలకు సెలవులు ఇస్తే చిన్నారులు సంబర పడుతున్నారు. కానీ కళ్ళ ముందే బంగారం లాంటి పంట తడిచి నేల పాలౌతుంటే రైతన్న దు:ఖాన్ని దిగ మింగుకోలేక కుమిలిపోతున్నారు. ఇంటి అవసరాలు, పాత బాకీలు, బ్యాంక్ ఋణాలు, చిన్నారుల చదువులు, ఇంటి మరమత్తులు, వైద్య ఖర్చులు, ఇలా ఎన్నో అవసరాలు నోరు తెరుచుకుని చూస్తూ ఉంటే అండగా నిలబడుతుందనుకున్న ధాన్య లక్ష్మీ తుఫాన్ కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతుంటే రైతన్న దిక్కుతోచని స్థితిలో రోదిస్తున్నారు. ఇది సెలవులు వచ్చాయని సంబరపడే సందర్భం కాదు. ఇది చల్లచల్లని వాతావరణంలో వేడి వేడిగా ఉల్లిపాయ పకోడి వంటి వంటకాలను ఆశ్వాదించే సంస్కారం కాదు. దేవుడికి పెట్టే నైవేద్యం కూడా పండించేది రైతన్నే.గుర్రం జాషువా చెప్పినట్లు వాని రెక్కల కష్టంబు లేని వాడు సశ్యరామ పండి పులకింప శంచాయించు. వాడు చమట ఓడిచి ప్రపంచానికి భోజనం పెట్టే వానికి భుక్తి లేదు. మనందరం ప్రార్థిద్దాం రైతన్నల కోసం. మన అందరి సంఘీభావాన్ని రైతన్నల మనో భావాల కోసం తెలుపుదాం. నేడు రైతన్న పరిస్థితి..

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతాంగం కళ్ళలో కన్నీళ్లు




**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** తుఫాన్ ప్రభావంతో చేతికి అందిన పంట నీట మునగడంతో మచిలీపట్నం నియోజకవర్గం గుండుపాలెం, చిన్నాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి పంట పొలాలను మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు రైతాంగం కళ్ళలో నీళ్లు కనబడుతున్నాయి అన్నారు. ఎంతగానో కష్టపడి పంట పండించుకుని ధాన్యం ద్వారా శ్రమకి ఫలితం వస్తుందనే సమయానికి తుఫాను వలన మొత్తం నీళ్లపాలు అయిందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గతంలో కూడా మేము చాలా సార్లు చెప్పాము. కాలువల్లో ఎప్పటికప్పుడు మట్టి తీయకపోవడం వలన ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి పంట పొలాలు పడిపోయే దానికి కారణమయ్యిందన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఎక్కడ కూడా ఒక చెంచాడు మట్టి తీయలేదు. గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు జూన్ మాసం కల్లా నీళ్లు ఇచ్చి సెప్టెంబర్ అక్టోబర్ మాసానికి పంటపొలాలు చేతికందే విధంగా చేశారు. దాని ద్వారా నవంబర్, డిసెంబర్ లో వచ్చే తుఫాన్లు తప్పించుకునే దానికి ఆలోచన చేశారు. నీళ్లు సకాలంలో అందించడానికి పట్టిసీమ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తే ఈ ప్రభుత్వం దానిని విస్మరించి ప్రాజెక్టును నీరుగార్చిందన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుకి అసలు ఆ శాఖ కోసం కనీసం అవగాహన లేకపోవడం దౌర్భాగ్యం. పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులను నీరుగార్చడం వలన సకాలంలో నీళ్లు అందించక చేతికందిన పంటను కోల్పోయారు రైతన్నలు అన్నారు. కృష్ణాజిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ తుఫాను కారణంగా కృష్ణాజిల్లాలో రైతాంగం మొత్తం బోరున విలపిస్తుందన్నారు. దీనికి కారణం ప్రభుత్వమే. రైతులకు అనేక కండిషన్లో పెట్టి, జిపిఆర్ఎస్ అనే సిస్టమును తీసుకొచ్చి, అది అయితే కానీ ప్రభుత్వం సబ్సిడీ కింద తీసుకొని పరిస్థితి. రైతులని నట్టేటే ముంచే ప్రభుత్వం వైసీపీ అన్నారు. రైతులకి కండిషన్స్ పెట్టకుండా వారికి నచ్చే మిల్లల్లో ధాన్యాన్ని అమ్ముకునే విసులుబాటు తక్షణమే కల్పించాలి అన్నారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేతికి అందిన పంటని సరైన సమయంలో ప్రభుత్వం సాకారం అందించకపోవడంతో తుఫాను వచ్చి పంట పొలాలని నీట మునిగిపోతున్నాయన్నారు. కోతకొచ్చిన పంటని కొత మిషన్ల ద్వారా సరైన సమయానికి ప్రభుత్వం సహాయం అందించి కోయించినట్లయితే ఈ రోజు ఈ పరిస్థితి ఉండేది కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లంకె నారాయణ ప్రసాద్,కాగిత గోపాలరావు, లంకె శేషగిరి, సలీం, వన రాజు, చిన్నం శేఖర్, లింగం విజయ్, రాయన శివ, పిన్నింటి అయ్యప్ప తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు నిలిపివేత



**కంచికచర్ల డిసెంబర్ 4 మేజర్ న్యూస్ :** స్థానిక మార్కెట్ యార్డ్‌లో పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేయబడిందని కార్య దర్శి తెలిపారు. తుఫాన్ కారణంగా సోమవారం నుండి బుధవారం వరకు పత్తి కొనుగోలను ఆపినట్లు ఆయన తెలిపారు.మార్కెట్ కమిటీ పరిధిలో గల పత్తి రైతులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా ఆయన కోరారు.

## భక్తులతో నిండిపోయిన శైవ క్షేత్రాలు



**నందిగామ, డిసెంబర్ 4, మేజర్ న్యూస్:** కార్తీక మాస మహోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం, మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో నిండిపోయాయి. కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయం, గోళ్ళమూడి శంభు లింగేశ్వర స్వామి దేవాలయం, దాములూరు రాఘవపురం రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు బిల్వ పత్ర పుష్ప అర్చనాది పూజలు జరిగాయి, ఆలయాల ప్రాంగణాలు పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక జ్యోతులు వెలిగించి దీపలక్ష్మికి పూజలు చేశారు.

## 24 గంటలుగా ఆగని వర్షం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమలో 24 గంటలుగా వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంగా దివిసీమ వ్యాప్తంగా గత 2 రోజుల నుండి వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా, అవనిగడ్డ– నాగాయలంక ప్రధాన రహదారితో పాటు పలు రహదారుల్లోని గుంటలలో వర్షపు నీరు తిష్ట వేసింది. ఆరుగాలం పండించిన పంట రైతాంగం చేతికి అందే తరుణంలో బంగాళాఖాతంలో అల్పపీ డనం ఏర్పడి అది కాస్తా వాయుగుండంగా మారి దివిసీమ వ్యాప్తంగా వర్షాలు పడుతూ ఉండటంతో జనజీవనం స్థంబించిపోయింది. ఎక్కువ మంది గృహాలకే పరిమితం కాగా, వర్తక, వాణిజ్య వ్యాపార సంస్థలతో పాటు రహదారులు అన్నీ వెలవెలబోతున్నాయి.

## జోరు వానలో ముందుకు సాగుతున్న పేర్ని కిట్టు



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** భారీ వర్షం సైతం లెక్కచేయకుండా ప్రజల క్షేమమే నాకు ముఖ్యమంటూ జోరు వానలో అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ యువ నాయకులు పేర్ని కిట్టు ముందుకు సాగుతున్నారు. తుఫాన్ హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా భారీ వర్షంలో అడుగులు వేస్తూ మచిలీపట్నం నియోజకవర్గం గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ వారికి ఇంకా ఏమన్నా సమస్యలు ఉంటే తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను తెలియజేస్తూ యువ నాయకులు పేర్ని కిట్టు ప్రజలతో మమేకమవుతున్నారు.

17వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999